సాక్షి
అనంతపురం

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



ఇసుక అక్రమ రవాణాపై సీరియస్

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ వినోద్ కుమార్ సీరియస్ అయ్యారు. 'సాక్షి'లో వెలువడిన కథనంపై స్పందించారు. IIలో



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.24 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం 35.2°/22.6°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రజలకు కలెక్టర్ దసరా శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్: చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్మాత ఆశీస్సులతో జిల్లా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు,సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించాలని జెడ్పీ పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. గతంలో జూలై 9న జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 101 రోజుల తరువాత మళ్లీ ఇప్పుడు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 90 రోజులకోసారి (మూడు నెలలు) సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. అయితే జెడ్పీ అధికారులు ఎప్పుడూ ఈ నిబంధన పాటించ లేదు. తమకు నచ్చినట్లు నిర్వహిస్తూ వస్తున్నారు. ఐఏఎస్‌లు ఇన్‌చార్జ్ సీఈఓలుగా పని చేసిన రోజుల్లోనూ ఈ నిబంధన పాటించలేదు. ఈ సారి 11 రోజులు ఆలస్యంగా నిర్వహిస్తున్నారు. జెడ్పీలో అధికార పక్షంగా వైఎస్సార్‌సీపీ ఉండగా, టీడీపీ కూటమి తరఫున గెలిచిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిపక్ష పాత్ర పోషించనున్నారు. దీంతో ఈసారి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించనున్నట్లు తెలుస్తోంది. సమావేశానికి సంబంధించి 63 మండలాల జెడ్పీటీసీ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సహా అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులకు సమాచారం చేరవేశారు. సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరు కావాలని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

భూముల మార్కెట్ విలువ సవరించాలి



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అర్బన్: భూముల మార్కెట్ విలువ సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రిజిస్ట్రేషన్, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి భూమి మార్కెట్ విలువ సవరణ చేపట్టాలని సూచించారు. మార్కెట్ విలువ ప్రతిపాదనలపై రిజిస్ట్రేషన్, అనుబంధ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, ఆర్డీఓ వసంత బాబు, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లా నాయక్, ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు, మునిసిపల్ అధికారులు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లోనే ఫుల్ కిక్కు!

- కర్ణాటక సరిహద్దు మండలాల మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు
- విడపనకల్లులో ఫుల్ డిమాండ్
- ఒక మద్యం షాపునకు 42 దరఖాస్తులు
- అనంతపురం నగరంలోని షాపులకు కూడా ఇన్ని దరఖాస్తులు కరువు
- ఆర్థికమంత్రి నియోజకవర్గంలోని మండల కేంద్రంపైనే అందరి చూపు
- కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న బొమ్మనహాళ్, రాయదుర్గం షాపులకూ గిరాకీ
- అక్రమ మద్యం వ్యాపారం చేయవచ్చనే ఉద్దేశంతోనే మాఫియా ఎత్తుగడ!

రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని పరిస్థితి అనంతపురం జిల్లాలో నెలకొంది. అన్ని జిల్లాల్లో జిల్లా కేంద్రాలు, పట్టణ కేంద్రాల్లో మద్యం షాపుల కోసం పోట్లాడుకుంటుంటే జిల్లాలో మాత్రం మారుమూల కర్ణాటక సరిహద్దుల్లో ఉండే షాపులకు భారీ పోటీ నెలకొంది. 30 వేల జనాభా కూడా లేని మండలాల్లో రెండు షాపులకు 80కి పైగా దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సరిహద్దు మండలాల్లో మద్యం షాపుల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.





కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న షాపులకు వచ్చిన దరఖాస్తులు ఇలా	
ప్రాంతం, షాపు నంబర్	అందిన దరఖాస్తులు
విడపనకల్లు 110	35
విడపనకల్లు 111	43
బొమ్మనహాళ్ 116	34
బొమ్మనహాళ్ 117	35
రాయదుర్గం మున్సిపాలిటీ 118	21
రాయదుర్గం మున్సిపాలిటీ 119	21
రాయదుర్గం మున్సిపాలిటీ 120	21
రాయదుర్గం మున్సిపాలిటీ 121	20
డి హీరేహాళ్ 124	33
గుమ్మఘట్ట 125	9
బెళుగుప్ప 132	32

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలోని విడపనకల్లు మండలంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అందిన భారీ దరఖాస్తులు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోని మారుమూల మండల కేంద్రం విడపనకల్లు. కానీ మద్యం షాపుల దరఖాస్తుల్లో జిల్లాలోనే ఇక్కడ ఎక్కువ నమోదు కావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పట్టుమని 30 వేలు జనాభా కూడా లేని ఈ మండల కేంద్రానికి రెండు షాపులు కేటాయించగా.. ఎక్కడా లేని విధంగా ఒక షాపునకు 43, మరో షాపునకు 35 దరఖాస్తులు వచ్చాయి. తక్కువ జనాభా ఉన్న ఈ మండల కేంద్రంలో దుకాణాల ఏర్పాటుకు ఇంత పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం అంతుచిక్కడం లేదు. వీటితో పాటు బళ్లారికి ఆనుకుని ఓబులాపురం దగ్గర ఉండే డీ హీరేహాళ్ మండలంలో ఒకే షాపునకు 33 దరఖాస్తులు రావడం చర్చనీయాంశమైంది. ఈ ప్రాంతాల్లో మద్యం షాపు దక్కించుకుంటే కర్ణాటక మద్యం ధర తక్కువైనప్పుడు ఇక్కడ అధికారికంగా విక్రయించవచ్చు లేదా ఏపీ మద్యం ధర తక్కువైతే కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చనేది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆ ఇద్దరి మధ్యే పోటీ..

విడపనకల్లు మండలంలో మద్యం పేరు చెబితే గిడ్డు మారయ్య, గడ్డం మారయ్యలే గుర్తుకొస్తారు. దశాబ్దాలుగా వీరిరువురూ మద్యం వ్యాపారంలో ఆరితేరారు. ఇద్దరూ టీడీపీ నాయకులే కావడం గమనార్హం. ఇప్పుడు ఎలాగూ ప్రభుత్వం వారిదే కాబట్టి ఇక్కడ మద్యం షాపులు దక్కించుకుంటే ఎవరూ అడ్డుచెప్పరనే భావనతో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభావం కూడా పెద్దగా లేదు కాబట్టి కర్ణాటక చీప్‌లిక్కర్‌గా పేరుగాంచిన టెట్రా ప్యాకెట్లు విచ్చలవిడిగా అమ్ముకోవచ్చుననే ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం.

15 షాపులకు భారీగా దరఖాస్తులు..

జిల్లాకు ఒక్క తాడిపత్రి మినహా మిగతా అన్ని వైపులా కర్ణాటక సరిహద్దు ఉంది. జిల్లాలోని 136 షాపులకు గురువారానికి 1,927 దరఖాస్తులు అందాయి. కణేకల్లు, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, రాయదుర్గం అర్బన్ ప్రాంతాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ మద్యం షాపులు దక్కించుకుంటే కర్ణాటక నుంచి అక్రమ మద్యం వ్యాపారం చేయవచ్చన్నది వ్యాపారుల ఉద్దేశంగా కనిపిస్తోంది. ఎలాగూ పోలీసులు టీడీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఉన్నారు కాబట్టి ఎవరూ ఏమీ అనరనేది మద్యం మాఫియా ధీమా. కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఏర్పాటు కానున్న షాపులన్నింటికీ భారీగానే దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది.

దుర్గంలో ఫ్లాప్..

- రెండు షాపులకు నాలుగే దరఖాస్తులు!

కళ్యాణదుర్గం రూరల్: టీడీపీ నేతల బెదిరింపుల కారణంగా కళ్యాణదుర్గంలో మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు తగ్గినట్లు తెలిసింది. దరఖాస్తుల సమర్పణకు శుక్రవారం చివరి రోజు కాగా, గురువారానికి కళ్యాణదుర్గం రూరల్‌లో రెండు షాపులకు నాలుగు దరఖాస్తులు మాత్రమే (ఒక్కో షాపునకు రెండు) అందాయి. ఇక.. కళ్యాణదుర్గం పట్టణంలోని మూడు షాపులకు కూడా ఒక్కో షాపునకు 5 నుంచి 6 దరఖాస్తులే వచ్చాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు ఎవరు నిర్వహించాలో అధికార పార్టీకి చెందిన పెద్ద మనుషులు నిర్ణయిస్తారని, వారిని కాదని దరఖాస్తు చేసుకుంటే డబ్బు నష్టపోతారని తెలుగు తమ్ముళ్లు ఔత్సాహికులను బెదిరించడంతోనే దరఖాస్తులు భారీగా తగ్గినట్లు సమాచారం.

12 చోట్ల వంటనూనె విక్రయ కౌంటర్లు

అనంతపురం అర్బన్/అగ్రికల్చర్: ఆయిల్ ట్రేడర్ల సహకారంతో జిల్లాలో 12 కేంద్రాల్లో వంటనూనె విక్రయాలకు 20 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో వంటనూనె ధరలు పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు తక్కువ ధరకే అందించడానికి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురంలో 3 కౌంటర్లు, తాడిపత్రిలో 2, నార్పల-1,గార్లదిన్నె-1,కూడేరు-1,గుంతకల్లు-2, గుత్తి-1, ఉరవకొండ- 1, రాయదుర్గం-4, కళ్యాణదుర్గం-2, శింగనమల-1, రాప్తాడులో ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. పామాయిల్ లీటరు రూ.118, సన్ ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ. 127 చొప్పున కౌంటర్లలో విక్రయిస్తారన్నారు.

- అనంతపురంలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ప్రారంభించారు. ఇప్పటికే బియ్యం, కంది బేడల విక్రయ కేంద్రం ఉందని, వంటనూనె కౌంటర్ కూడా అందుబాటులో ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, శుక్రవారం నుంచి కిలో టమాట రూ.40, కిలో ఉల్లి రూ.35 ప్రకారం అమ్మకాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

పల్లె పండుగ జయప్రదం చేయాలి



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో 'పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలను' ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించి జయప్రదం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలను గ్రామాల్లో చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ప్రారంభించాలని చెప్పారు. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాసమాచార బోర్డులను తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో చేపట్టే పనులకు భూమిపూజ కార్యక్రమాల ఫొటోలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ఉపాధి పథకం ద్వారా ఏ పనులు చేపట్టాలో గుర్తించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం, రోడ్లు, కాలువల నిర్మాణం తదితర పనులు చేపట్టేలా చూడాలన్నారు. పంచాయతీల్లో చేపట్టబోయే పనులు గతంలో చేయలేదని ఏఈ, డీఈ, ఈఈ, ఇలా పైస్థాయి వరకు సర్టిఫై చేయాలన్నారు. పనుల జాబితా, గ్రౌండింగ్ చేసిన పనులను జియోట్యాగ్ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు అందేలా నియోజకవర్గ, మండలస్థాయి ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థాయిలో నిలపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ సలీమ్‌బాషా, డీపీఓ నాగరాజు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓలు, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

వాటర్ హార్వెస్టింగ్‌లో జిల్లా అగ్రస్థానం

రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల్లో రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోందని కేంద్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శంభునాథ్‌గుప్తకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. జలశక్తి అభియాన్, జై సంచయ్ జన్ భాగీదారి అమలుపై ఆయన గురువారం ఢిల్లీ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. జిల్లాలో జలశక్తి అభియాన్‌తో పాటు జై సంచయ్ జన్ భాగీదారి అమలుకు సంసిద్ధంగా ఉన్నామని ముఖ్యకార్యదర్శికి కలెక్టర్ చెప్పారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్‌కు సంబంధించి 175 పనులు చేపట్టి జిల్లాను అగ్రస్థానంలో నిలిపామన్నారు. స్వచ్ఛతమే జన్ భాగీదారీ అంశంలో జిల్లాకు రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కిందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఏడు లక్షల మొక్కలు నాటామన్నారు. అమృత్ సరోవర్ కింద 75 పనులు పూర్తి చేశామన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా జిల్లాలోని దేవాలయాల వద్ద ఉన్న కోనేరుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులను, చెక్‌డ్యామ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, జలాశయ, బోర్‌వెల్ రీచార్జ్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతి వర్షపు చినుకును సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ వినీత్‌కుమార్, ఎస్ఈ శ్రీరామ్, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేసీ ముఠా దౌర్జన్య కాండ

- యాడికిలో హల్‌చల్ చేసిన 'తమ్ముళ్లు'
- మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులకు బెదిరింపులు
- ఇంటి తాళాలు పగులగొట్టి దౌర్జన్యం
- ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్ కిడ్నాప్
- ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు
- పచ్చ రౌడీల నుంచి రక్షించిన వైనం





ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్‌ను ఎంపీపీ ఇంటి వద్ద అప్పగిస్తున్న సీఐ ఈరన్న



ఎంపీటీసీ రామ్మోహన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: జేసీ ముఠా బరితెగించింది. యాడికి మండలంలో గురువారం హల్‌చల్ చేసింది. స్థానికులను భయకంపితులను చేసింది. చంపుతామంటూ పలువురు వైఎస్సార్ సీపీ నేతలను బెదిరించడమే కాకుండా ఓ నాయకుడిని కిడ్నాప్ చేసింది. వివరాలు... గుత్తి ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని యాడికి మండలంలో త్వరలో 4 వైన్ షాపులు ఏర్పాటు కానున్నాయి. వాటికి సంబంధించి లైసెన్సుల కోసం యాడికి మండల కేంద్రం నుంచి ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు బాలిరెడ్డి, రాయలచెరువు గ్రామానికి చెందిన జానా దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన ముఠాను ఉసిగొల్పారు. ఆయన ఆదేశాలతో గురువారం మధ్యాహ్నం టీడీపీ నేత, మాజీ ఎంపీపీ రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్మనాయుడు, పరిమి చరణ్ ఆధ్వర్యంలో వంద మందితో కూడిన పచ్చ ముఠా రంగంలోకి దిగింది. యాడికి మండలకేంద్రానికి చేరుకుని ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ఇంటి తాళాలను పగుల గొట్టింది. వైఎస్సార్ సీపీ నాయకుడు బాలిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయనతో పాటు కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేసింది. మద్యం షాపు కోసం చేసిన దరఖాస్తును విరమించుకోవాలని వార్నింగ్ ఇచ్చింది. ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్ ఓ టీ స్టాల్ వద్ద ఉన్నాడని తెలుసుకుని అక్కడికే వెళ్లింది. 'ఒరేయ్ నీకు ఎన్ని గుండెల్రా.. మా ప్రభుత్వంలో మద్యం షాపుల కోసం టెండర్లు వేస్తావా.. వాటిని విరమించుకోకపోతే చంపుతాం' అంటూ బెదిరించింది. టెండర్ రసీదులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఇంటి వద్ద ఉన్నాయని చెబుతుండగానే స్కార్పియో వాహనంలో రామ్మోహన్‌ను పచ్చ నేతలు ఎక్కించుకెళ్లారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి విషయాన్ని తాడిపత్రి డీఎస్పీ, జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి తెలియజేశారు. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన యాడికి సీఐ ఈరన్న తన సిబ్బందితో టీడీపీ శ్రేణులను వెంబడించారు. రాయలచెరువు వద్ద వారి వాహనాన్ని ఆపి రామ్మోహన్‌ను కాపాడారు. కాగా, రామ్మోహన్ కిడ్నాప్‌నకు గురయ్యారనే సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బొంబాయి రమేష్ నాయుడు ఇంటి వద్దకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- మద్యం పాలసీలో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- ఉచిత ఇసుక అని బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు
- దోపిడీనే పనిగా పెట్టుకున్న కూటమి ప్రజాప్రతినిధులు
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. మద్యం, ఇసుక పాలసీల్లో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రైం రేటు పెరిగిందన్నారు. మద్యం పాలసీలో కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. మద్యం సిండికేట్‌తో ఎవరూ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. 'ఎన్నికల్లో నెగ్గడానికి రూ.కోట్లు ఖర్చు చేశాం, ఆ డబ్బు రాబట్టుకోవడానికి ఇసుక, మద్యం పాలసీ ఉపయోగించుకుంటున్నాం' అన్న ధోరణిలో ప్రజాప్రతినిధులు ముందుకెళ్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా చేయాలని సీఎం చంద్రబాబు చూడడం దురదృష్టకరమన్నారు. సాక్షాత్తూ మంత్రి నారాయణ రూ.2 కోట్లతో వంద మద్యం షాపులకు టెండర్లు వేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొత్త బ్రాండ్లు తెచ్చారంటూ ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. నేడు సీఎం చంద్రబాబు రూ.99 కే క్వార్టర్ మద్యం అంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మద్యం సిండికేట్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల మధ్యే భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పిన చంద్రబాబు పరోక్షంగా బ్లాక్ మార్కెట్‌కు తలుపులు తెరిచారన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 80 లక్షల టన్నుల ఇసుకను నిల్వ ఉంచితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుంచే ఆ ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అమ్మేసి ప్రజాప్రతినిధులు జేబులు నింపుకున్నారన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలోని కాలువపల్లి, కూడేరు, నరసాపురం, విడపనకల్లులో ఇసుక దోచేస్తున్నారన్నారు. గతంలో 'సెబ్' నిఘా ఉండేదని, ఈ ప్రభుత్వం అలాంటి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. నిర్మాణరంగం కుదేలై పనులు లేవంటూ కూలీలు ధర్నాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అరాచక పాలనపై ఉద్యమించడానికి వెనుకాడబోమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



అనంతపురంలో అమ్మవారి వేషధారణలో బాలికలు



ఉరవకొండలో దుర్గాదేవిగా జగదీశ్వరి మాత



మోహినీదేవి అలంకారంలో ఖాద్రీశుడు

ఉప్పొంగిన భక్తి భావం

దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తుతున్నాయి. గురువారం వివిధ ఆలయాల్లో జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనారసింహుడు కూడా గురువారం రాత్రి మోహినీ అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

చీనీ చెట్ల దగ్ధం


మంటల్లో కాలిపోయిన చీనీ చెట్లు

గార్లదిన్నె: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో గార్లదిన్నె మండలం పి.కొత్తపల్లికి చెందిన రైతు ప్రభాకరరెడ్డి తోటలోని చీనీ చెట్లు దగ్ధమయ్యాయి. తనకున్న పొలంలో రైతు 1,050 చీనీ చెట్లను సాగు చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి తోటను చుట్టుముట్టాయి. చీనీ చెట్లు, డ్రిప్పు, స్ప్రింకర్లు, పురుగు మందులు స్ప్రే చేసే మూడు ట్యాంకర్లు కాలిపోయాయి. దాదాపు రూ.10 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.











సెల్‌లో మానవ సంబంధాలు బందీ

- సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్


మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం మెడికల్: సెల్‌ఫోన్ బంధాలకే యువత ఎక్కువ ప్రాధాన్యతనిస్తుండడంతో మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ అభిప్రాయపడ్డారు. దీంతో మానవ సంబంధాలు సెల్‌ఫోన్‌లో బందీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం నెలకొంటుందని అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యం దినాన్ని పురస్కరించుకుని అనంతపురం సైకియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇన్నర్ వీల్ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని ఐఎంఏ హాల్‌లో మానసిక ఆరోగ్యంపై సదస్సు నిర్వహించారు. అంతకు ముందు ఐఎంఏ హాల్ నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సదస్సులో వక్తలు మాట్లాడుతూ.. మంచి కుటుంబం, మిత్రులు, గురువులు సహచర్యంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రశాంతమైన జీవితం కోసం యోగ, ప్రాణాయామం, సానుకూల దృక్పథం వంటివి అలవర్చుకోవాలన్నారు. డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ... సత్ప్రవర్తన, చేయూత, ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. అనంతరం వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన 40 మందికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలను సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, నాయకులు డాక్టర్ సుప్రజ చౌదరి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ... తెలంగాణలో టీచరు

- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


మండల అనిల్‌కుమార్

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లికి చెందిన పేదింట బిడ్డ మండల అనిల్‌కుమార్ తెలంగాణ డీఎస్సీ ఓపెన్ కేటగిరీలో ప్రతిభ చాటి ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు ఆంజేయులు, వరలక్ష్మి తమక్కున్న ఐదు ఎకరాల పొలంలో వర్షాధార పంటలను సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దీనికి తోడు తండ్రి గ్రామంలో ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వరలక్ష్మి దినసరి కూలీ పనులకూ వెళుతుంటుంది. వీరికి కుమారుడు అనిల్‌కుమార్‌తో పాటు కుమార్తె త్రివేణి ఉన్నారు. త్రివేణి ఎంబీఏ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ శిక్షణలో ఉంది. పదో తరగతి వరకూ కళ్యాణదుర్గంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీని అనంతపురంలోని వేర్వేరు ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి చేసిన అనిల్... ఆ తర్వాత కర్నూలులో డీఎడ్ పూర్తి చేశారు. అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీ శిక్షణ పొందుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ప్రతిభ చాటి ఎస్జీటీ కొలువు సాధించారు. చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే కోరికతోనే తాను పోటీ పరీక్షకు సిద్ధమైనట్లు ఈ సందర్భంగా 'సాక్షి'కి అనిల్‌కుమార్ తెలిపారు. గతంలో నిర్వహించిన డీఎస్సీలో 1.05 మార్కులతో అవకాశాన్ని చేజార్చుకున్నా.. పట్టుదలతో మరోసారి ప్రయత్నం చేసి ఎస్జీటీ తెలుగు పండిట్‌గా పోస్టు దక్కించుకున్నట్లు వివరించారు.

మాలా కష్టపడకూడదని..



మా పిల్లలు మాలా కష్టపడకూడదని భావించాం. అందుకే ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పిల్లల చదువుల విషయంలో లోటు రానివ్వకుండా చూసుకున్నాం. మేము వ్యవసాయం, కూలి పనులు చేస్తున్నా.. ఏనాడూ మా పిల్లలను అటుగా పంపించలేదు. వాళ్లు ప్రయోజకులైతే చాలు అనుకున్నాం. మా ఊరి ఎస్సీ కాలనీలో సుమారు 13 ఇళ్లు ఉన్నాయి. మా కాలనీలో ఇప్పటి వరకూ ఎవరూ గవర్నమెంట్ ఉద్యోగి లేరు. మావాడికి గవర్నమెంట్ ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది.

– ఆంజనేయులు, వరలక్ష్మి, అనిల్‌కుమార్ తల్లిదండ్రులు

ఉద్యానానికి రూ.17.82 కోట్లు

- అర్హత కలిగిన రైతులకు ప్రభుత్వ ఫలాలు
- 37,500 హెక్టార్లలో సూక్ష్మసాగు
- సమీక్షలో డీహెచ్‌ఓ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి


సమీక్షిస్తున్న డీహెచ్‌ఓ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్), ఆయిల్ ఫాం, రాష్ట్రీయ కృషి వికాస యోజనా (ఆర్‌కేవీవై) కింద రూ.17.82 కోట్ల బడ్జెట్‌తో పథకాలు అమలు చేస్తున్నట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి (డీహెచ్‌ఓ) బీఎంవీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి తెలిపారు. ఉద్యాన పథకాల అమలుపై జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులతో గురువారం వారు సమీక్షించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఉద్యాన పథకాలు, బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించి ప్రభుత్వ ప్రయోజనాలు దక్కేలా చూడాలన్నారు. కొత్తగా 300 హెక్టార్లలో ఆయిల్‌ఫాం (పామాయిల్) తోటల పెంపకానికి కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాల్ మండలాలను ఎంపిక చేశామన్నారు. నీటి వసతి కలిగిన రైతులకు మొక్కలు, ఎరువులు, నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చుల కింద రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఒక్కో రైతు 25 హెక్టార్ల వరకూ పామాయిల్ తోటలు సాగు చేయవచ్చన్నారు. మామిడి, మాజ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్, అంజూర, నేరేడు తదితర పంటలు సాగు చేసే రైతులకు మొక్కల ఖర్చు, ఎరువులు, పురుగు మందుల ఖరీదులో 40 శాతం రాయితీ ఇస్తామన్నారు. పూల తోటలు సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ.16 వేలు రాయితీ ఉంటుందన్నారు. వ్యక్తిగత ఫారం పాండ్స్ నిర్మాణానికి రూ.75 వేలు, ఐదు గురు రైతులు గ్రూపుగా ఏర్పడి ఎకరా స్థలంలో కమ్యూనిటీ ఫారంపాండ్ నిర్మించుకుంటే రూ.20 లక్షలు రాయితీ వర్తింపజేస్తామన్నారు. దానిమ్మ, ద్రాక్ష రైతులకు యాంటీబర్డ్ నెట్ ఏర్పాటు చేసుకునేందుకు హెక్టారుకు రూ.33 వేలు ఇస్తామని తెలిపారు. పోస్ట్ హార్వెస్టింగ్ మేనేజ్‌మెంట్ కింద ప్యాక్‌హౌస్‌ల ఏర్పాటుకు రూ.2 లక్షలు, పందిర్లకు రూ.ఒక లక్ష, అలాగే మల్చింగ్‌కు రాయితీ ఉంటుందన్నారు. 50 శాతం రాయితీతో 32 స్ప్రేయర్లు అందిస్తామన్నారు. 75 శాతం రాయితీతో కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్‌రూంలు మంజూరు చేస్తామని తెలిపారు. హైబ్రీడ్ కూరయగాయల విత్తనాల కొనుగోలుకు హెక్టారుకు రూ.3 వేలు ఇస్తామన్నారు. అంతేకాకుండా ఏపీఎంఐపీ ద్వారా ఈ సారి అత్యధికంగా 37,500 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే మొదటి విడతగా కొంతమంది రైతులకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. లక్ష్యాలు పూర్తీ కావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. పరస్పర సహకారంతో అటు ఉద్యాన ఇటు ఏపీఎంఐపీ పథకాలు పూర్తీ కావాలని ఆదేశించారు.

సీజ్డ్ ఇసుక పంపిణీకి చర్యలు

- ఇన్‌చార్జ్ ఆర్డీఓ విన్నూత


సీజ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ విన్నూత

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రిలో ఇటీవల సీజ్ చేసిన ఇసుకను ప్రజావసరాలకు పంపిణీ చేస్తున్నట్లు కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఆర్డీఓ విన్నూత స్పష్టం చేశారు. గురువారం సాయంకాలం స్థానిక తహసీల్దార్ ఫణికుమార్‌తో కలసి రచ్చుమర్రి ఇసుక రీచ్‌ను ఆమె పరిశీలించారు. గతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 13.28 మెట్రిక్ టన్నుల ఇసుకను మైనింగ్, రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ వెంటనే స్పందించి ప్రజావసరలకు ఇసుకను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. తొలి రోజు ఆన్‌లైన్‌లో 8 ట్రిప్పర్ల ఇసుక కోసం బుక్ చేశారన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ కోసం కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ సమస్య క్లియర్ కాగానే ట్రాక్టర్ల ద్వారా కూడా ఇసుకను తీసుకెళ్లవచ్చునన్నారు. ఇసుక అవసరమున్న వారు సచివాయాల ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీజ్ చేసిన ఇసుక సరఫరా పూర్తయ్యాక టెండర్ ప్రక్రియ నిర్వహించి ఈ రీచ్‌ను ప్రారంభిస్తామన్నారు. అలాగే కంబదూరు మండలంలోని కర్తనపర్తి, బ్రహ్మసముద్రం మండలంలోని అజ్జయదొడ్డి ఇసుకరీచ్‌లను ప్రారంభించేందుకూ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

16 మంది ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లకు 'షోకాజ్'

అనంతపురం అగ్రికల్చర్: ఎరువుల సొమ్ము స్వాహా చేసిన 16 మంది ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అక్రమాలపై 'ఎరువుల సొమ్ము మింగేశారు' శీర్షికన గురువారం 'సాక్షి'లో కథనం వెలువడిన తెలిసిందే. దీనిపై డీఏఓ ఉమామహేశ్వరమ్మ స్పందించారు. ఆర్‌ఎస్‌కేలో రైతులకు అమ్మిన ఎరువులకు సంబంధించి సొమ్ము వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్‌కు జమ చేయకుండా సొంతానికి వాడుకున్న 16 మంది ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లను గుర్తించారు. వీరికి డివిజన్ ఏడీఏల ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోపు ఏపీ మార్క్‌ఫెడ్‌కు సొమ్ము జమ చేయాలని, లేకుంటే సీసీఏ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ సీరియస్

రాయదుర్గం: ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్ అయ్యారు. ఈ నెల 9న 'వేదవతికి గర్భశోకం' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. దీంతో గురువారం ఉదయం రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో మైన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. డి హీరేహాళ్ మండలం బాదనహాళ్ వద్ద హగరి నదిలో నుంచి ఇసుక లోడ్‌తో బయలుదేరుతున్న ట్రాక్టర్‌ను మైనింగ్ టెక్నికల్ అధికారి జ్ఞానేశ్వరి గుర్తించి అక్కడే అన్‌లోడ్ చేయించారు. మరికొన్ని ట్రాకర్లు అడ్డదారుల్లో ఉడాయించాయి. పట్టుబడిన ట్రాక్టర్‌ను రాయదుర్గం పీఎస్‌లో అప్పగించి, కేసు నమోదు చేయించారు. గుమ్మఘట్ట, బెళుగుప్ప మండలాల్లోనూ తనిఖీలు కొనసాగాయి.

కారు ఢీ - యువకుడి మృతి


పోతులయ్య (ఫైల్)

రాప్తాడు: స్థానిక 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన తలారి కరిబసప్ప కుమారుడు పోతులయ్య (36) వ్యవసాయంతో పాటు టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక 44వ జాతీయ రహదారికి అవతలి వైపున ఉన్న తన దొడ్డిలో గురువారం సాయంత్రం ఆవుల పాలు పితుక్కొని ఇంటికి బయలుదేరాడు. జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే బెంగళూరు నుంచి కర్నూలు జిల్లా యాదగిరి గుట్టకు వెళుతున్న కారు ఢీకొని ముందుకెళుతూ... అయ్యవారిపల్లి రోడ్డు వైపుగా నడుచుకుంటూ వెళుతున్న అదే గ్రామానికి జోగి లక్ష్మీనారాయణనూ ఢీకొంది. ఘటనతో ఇద్దరూ 50 మీటర్ల దూరంలో ఎగిరి పడ్డారు. ఇద్దరి తలలకూ బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో పోతులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య అరుణమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. జోగి లక్ష్మీనారాయణను తొలుత సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమిస్తుండడంతో వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సీఐ టీవీ శ్రీహర్ష కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హెచ్చెల్సీలో వ్యక్తి గల్లంతు

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన కె.కిషోర్‌కుమార్ (44) హెచ్చెల్సీ గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు వ్యవసాయంతో పాటు సబర్సిబుల్ మోటార్ సేల్స్ అండ్ సర్వీసు చేస్తూ జీవనం సాగిస్తున్న కిషోర్‌కు భార్య అరుణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక పీరాషావలి దర్గాలో పూజలు చేయించి వస్తానంటూ గురువారం సాయంత్రం ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. హెచ్చెల్సీ గట్టున బైక్, కంటి అద్దాలు, చెప్పులు కన్పించాయి. దీంతో హెచ్చెల్సీలో దూకి ఉంటాడని భావించిన కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. భర్త గల్లంతుపై అరుణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బుక్కరాయసముద్రం: మండలంలో అర్ధంతరంగా నిలిచిన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా హౌసింగ్ పీడీ శైలజ ఆదేశించారు. బీకేఎస్ మండలం అమ్మవారిపేట గ్రామంలో గురువారం ఆమె పర్యటించి హౌసింగ్ కాలనీని పరిశీలించారు.

లింగ నిర్ధారిత వీర్యంతో ప్రయోజనాలు మెండు

- రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు


పెయ్య దూడల ప్రదర్శనను నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ ప్రక్రియ భవిష్యత్తులో అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. రాప్తాడు మండలం మరూరులో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెయ్య దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడారు. అత్యధిక పాడి కోసం కేవలం పెయ్య దూడలే జన్మించేలా లింగ నిర్ధారిత వీర్యాన్ని వృద్ధి చేసినట్లు తెలిపారు. దూడలు త్వరగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన 15 పెయ్య దూడలు, సాధారణ వీర్యం ద్వారా పుట్టిన 35 దూడలను ప్రదర్శనలో ఉంచారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన మరూరు గ్రామ పాడి రైతులు ఓబిరెడ్డి, నర్సింములు, కదిరప్పకు పాల క్యాన్లు అందజేశారు. పాడి పరిశ్రమలో పలువురికి ఆదర్శంగా నిలిచిన బండమీదపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు ఉప్పర నరసింహులును ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వెంకటస్వామి, డీఎల్‌డీఏ ఈఓ సుధాకర్, ఉప సంచాలకులు రమేష్ రెడ్డి, సహాయ సంచాలకులు ప్రకాష్, డీఎల్‌డీఏ వీఏఎస్ వినోద్‌కుమార్, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

కంటైనర్ వెహికల్స్

■ మెటీరియల్ సప్లయ్ చేయుటకు కంటైనర్ మరియు A/c. కంటైనర్ వాహనములు కిలో మీటర్స్ ఆధారంగా బాడుగకు కావలెను. సెల్ : 7204580313. [A-762461]

EDUCATION

DMLT ADMISSIONS

■ DMLT 2సం॥ కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Q : ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) # SEEDS కాలేజ్, ATP. 9440255034. [A-1370]

REAL ESTATE

PLOT FOR SALE

■ దసరా ఆఫర్: 2,50,000/- లకే 11 సెంట్లు (4.4 గుంటలు) 532 గ॥ ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గర 48 ఎర్రచందనం మొక్కలతో ఫామ్‌ల్యాండ్ అమ్మకం. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 95234 56789. [B-1248596]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024, 9640400073 [H-796284]



■ తాహ హాస్పిటల్, ATP నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్-2, మెడికల్ షాప్‌లో పనిచేయుటకు-2, మేనేజర్స్ - 2 (స్త్రీలు) కావలెను. సెల్ : 7399442222. [A-762460]

■ అనంతపురము నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q : డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్ : 9493400426. [A-762459]

■ 7 హిల్స్ ట్రేడర్స్, ATP. చాక్లెట్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు (1) సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జీతం : 12 వేలు + పెట్రోల్ 3 వేలు. FMCG నందు అనుభవం + 2 వీలర్ తప్పనిసరి & అనుభవం కల్గిన అకౌంటెంట్ కావలెను. జీతం : 10,000/- సెల్ : 9491890017. [A-782454]

■ JOB VACANCY: Work from Home, J.K.Enterprises, Age: 18 to 45 yrs, 10th to Any Degree, Sal: 18000/- to 25000/- ✆ 8341277370. [T-789011]

■ వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీ : ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటివద్ద ఉండి పార్ట్/ఫుల్ టైం ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop / Desktop, స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 74164 40881 [B-527]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185477]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801. [M-1185300]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సమాచార శాఖలో ఆయుధ పూజ



పూజ చేస్తున్న డీఐపీఆర్ఓ గురుస్వామి శెట్టి

అనంతపురం అర్బన్: దసరా ఉత్సవాల్లో భాగంగా విజయదశమి పండుగ ముందు నిర్వహించే ఆయుధ పూజ కార్యక్రమాన్ని సమాచార, పౌర సంబంధాల శాఖలో గురువారం ఘనంగా నిర్వహించారు. శాఖ వాహనాలు, సామగ్రికి డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయ సిబ్బందికి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు విజయదశమి శుభకాంక్షలు తెలియజేశారు. డీపీఆర్ఓ రమేష్ బాబు, పీఆర్ఓ సూర్యానారాయణరెడ్డి, ఏపీఆర్ఓ హరినాథ్‌నాయక్, సిబ్బంది ప్రభావతి, చాంద్‌బాషా, దుర్గా, సుహాసిని, దామోదర్ రెడ్డి, కోటప్ప, అమ్మనమ్మ, రాజారావు, నజీర్, భాసర్, ఖాశీం పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు అభినందన

అనంతపురం: జాతీయ స్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ ఎం.చలపతి, రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో పతకం సాధించిన జి.దీపను ఎస్పీ పి.జగదీష్ గురువారం అభినందించారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు కర్నూలులో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ గ్రూప్–బి మెన్ విభాగంలో ఎం. చలపతి రెండో స్థానం, సీనియర్ గ్రూప్–బి ఉమెన్ విభాగంలో జి. దీప ఐదో స్థానం దక్కించుకుని మైసూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ తన కార్యాలయంలో వారిని అభినందించారు.

దివ్యాంగులకు చేయూతనిద్దాం



సైకిల్ అందజేస్తున్న ఏడీ అబ్దుల్ రసూల్, ఎన్‌కేసీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అనంతపురం రూరల్: దివ్యాంగులకు చేయూత అందించి స్వశక్తితో ఎదిగేలా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్ అన్నారు. గురువారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయం వద్ద ఎన్‌కేసీ సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుడు బాషాకు మూడు చక్రాల సైకిల్ అందించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. దివ్యాంగుల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన దివ్యాంగులకు అండగా నిలవటం గొప్ప విషయమన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్‌కేసీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కమల్‌నాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మహబోధి, కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆర్థికసాయం



కార్మికులకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ

అనంతపురం రూరల్: దసరా పండగను పురస్కరించుకుని ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షురాలు, రుద్రంపేట ఎంపీటీసీ–4 మహబూబీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు ఆర్థిక సాయమందించారు. గురువారం చంద్రబాబు నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ కార్మికులకు రూ.20 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడటం కోసం తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులు దసరా పండగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఆర్థికసాయం అందజేశామన్నారు. నాయకులు వెంకటరాముడు, అక్కమ్మ, ఖాజా, జయమ్మ పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ

అనంతపురం క్రైం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఎస్‌బీఐ సాయినగర్ బ్రాంచ్ వారు రెండు వీల్‌చైర్‌లకు వితరణ చేశారు. గురువారం ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీలక్ష్మితో పాటు డిపో మేనేజర్‌కు ఈ వీల్‌చైర్‌లను బ్యాంక్ అధికారులు చంద్రమోహన్, కృష్ణ అందజేశారు.

హోటళ్లపై దాడులు

అనంతపురం: జిల్లాలోని పలు దాబాలు, హోటళ్లలో గురువారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా మద్యం సేవిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా ప్రత్యేక దృష్టి సారించాలనే నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. వీటితో పాటు కర్ణాటక మద్యం జిల్లాలోకి అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా జిల్లా అంతటా తనిఖీలు, దాడులు ముమ్మరం చేశారు.

ఇవేమి రోడ్లు బాబోయ్..



కమలానగర్‌లో భయంగా వెళ్తున్న వాహనదారుడు



తిలక్ రోడ్డు మసీదు వద్ద ఉన్న దెబ్బతిన్న రహదారి



జీసస్ నగర్‌లో రోడ్డు మధ్యలో ఇలా..

- నగరంలో ప్రధాన రోడ్లకు చిల్లులు
- ప్రమాదాలు జరిగే అవకాశం
- గుంతలతో వాహనాలు నడవలేని పరిస్థితి

అనంతపురం కార్పొరేషన్: నగరం గుంతలమయంగా మారింది. రోడ్డుపై వాహనాలు వెళ్లాలంటే దడ దడ అంటూ సౌండ్ రావాల్సిందే. సుభాష్ రోడ్డు, రాజు రోడ్డు, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, సూర్యనగర్, సంగమేష్ సర్కిల్, రాంనగర్, తదితర ప్రధాన రోడ్లకు చిల్లులు పడ్డాయి. అలాగే విద్యుత్ నగర్, జీసస్ నగర్, హౌసింగ్ బోర్డు, కమలానగర్, పాతూరు, తిలక్ రోడ్డు, వేణుగోపాల్ నగర్, లక్ష్మీనగర్, నవోదయ కాలనీ, విద్యుత్‌శక్తి నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, యువజన కాలనీలో తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రోడ్లు గుంతకల మయంగా మారాయి. రూ.కోట్ల బడ్జెట్ ఉన్న నగరపాలక సంస్థలో అధికారులు పనులు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. అందుకు ప్రధాన కారణంగా ఇటీవల నగరపాలక సంస్థ పరిధిలో రూ.13 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా.. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రమేయంతో ఆ పనులు ముందుకుసాగడం లేదు. ఇక కొత్త పనులకు ఆస్కారం లేకుండా పోయింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ముందు చూపుతో వ్యవహరించి నగరంలో ఏర్పడ్డ గుంతలకు ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభిస్తారో లేదో చూడాలి. ఇదిలా ఉండగా ఇటువంటి మార్గాల్లో వెళ్లడం ద్వారా స్పాండలైటీస్ సమస్యతో పాటు కీళ్లు, మోకాళ్ల నొప్పులు వచ్చే ప్రమాదం లేకపోలేదు.

గుంతలు పూడ్చాలి..

విద్యుత్ నగర్ నుంచి నాయక్ నగర్‌కు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. గతంలో అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. కానీ అధికారుల్లో ఎటువంటి మార్పు లేదు. రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో చాలా మంది గాయాలపాలయ్యారు. పాలకులు స్పందించి గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలి.



– ప్రభాకర్ రెడ్డి, విద్యుత్‌నగర్

మాడిపోయిన టమాట పంట పరిశీలన

రాప్తాడు రూరల్: ఎక్కువ మోతాదులో రసాయనిక మందులు వాడడం వల్లే అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామంలో రైతు చిట్టిబాల ఓబిరెడ్డి సాగు చేసిన టమాట పంట దెబ్బతిందని అధికారులు ప్రాథమికంగా తేల్చారు. గురువారం 'సాక్షి'లో 'కొంపముంచిన రసాయనిక మందులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు రంగంలోకి దిగారు. మండల హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, మండల వ్యవసాయ అధికారి శశికళ తదితరులు గ్రామానికి వెళ్లి టమాట పంటను పరిశీలించారు. ఏయే మందులు వాడారు? ఎంత మోతాదులో వాడారు? ఎప్పుడు మందులు కొట్టారు? తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. తాను వాడిన మందులకు సంబంధించిన ఖాళీ బాటిళ్లను రైతు అందజేశాడు. తర్వాత అక్కడి నుంచి రామినేపల్లికి చేరుకున్న అధికారులు.. ఫర్టిలైజర్ షాపును పరిశీలించారు. రైతు కొనుగోలు చేసిన మందులకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. అదే బ్యాచ్ మందులు వాడిన రెండు తోటలు పరిశీలించారు. ఆ పంటలు బాగున్నట్లు గుర్తించారు. రైతు ఓబిరెడ్డి మోతాదుకు మించి మందులు వాడడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. అవసరమైతే ఉద్యాన శాస్త్రవేత్తల అభిప్రాయం తీసుకుంటామంటున్నారు.

లబోదిబోమంటున్న రైతు

తాను మందులు కొనుగోలు చేసే సమయంలో దుకాణ యజమానితో పాటు స్వయంగా కంపెనీ ఉద్యోగి ఉన్నాడని రైతు చెబుతున్నాడు. తాను సాగుచేసిన పంట వివరాలన్నీ చెప్పిన తర్వాత ఆయన సూచనల మేరకే రెండు రకాల మందులు కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. ఇప్పుడేమో ఎక్కువ మోతాదులో మందులు వేశావని అంటున్నారని.. దానికి తానెలా బాధ్యుడుని అవుతానని వాపోయాడు. అధికారులేమో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్లిపోయారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం జరిగేలా చూడాలని రైతు ఓబిరెడ్డి కోరుతున్నాడు.

యువరాజ్ బార్‌పై దాడి

- అద్దాలు ధ్వంసం చేసి ఏసీని పగలగొట్టిన దుండగులు
- రాళ్లు విసిరి భయాందోళన సృష్టించిన వైనం
- ఎమ్మెల్యే దగ్గుపాటి మనుషులుగా అనుమానిస్తున్న బార్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్‌లో ఉన్న యువరాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌పై గురువారం రాత్రి దుండగులు దాడికి దిగారు. మాకు తెలియకుండా వైన్ షాపులకు టెండర్లు వేస్తారా అంటూ ఏసీ గదిలోకి వెళ్లి అద్దాలు పగలగొట్టారు. ఏసీని ధ్వంసం చేశారు. బార్ యాజమాన్యానికి సంబంధించిన వారు వారించినా వినకుండా ఇష్టారాజ్యంగా రాళ్లు విసిరినట్టు బాధితులు వాపోయారు. ఇంతలోనే బార్ యాజమాన్యానికి సంబంధించిన వ్యక్తులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని ఫిర్యాదు తీసుకుని వెళ్లిపోయారు. దుండగుల దుశ్చర్యను బట్టి స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మనుషులే ఈ దాడికి దిగినట్టు బార్ యాజమాన్యం అనుమానిస్తోంది. శుక్రవారంతో టెండర్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ దాడి తీవ్ర చర్చనీయాంశమైంది. గురువారమే యాడికిలో టీడీపీ నేతలు ఒక వ్యక్తిని కిడ్నాప్ చేయగా.. పోలీసులకు సమాచారం అందడంతో విడిచిపెట్టారు. రాత్రి నగరంలోని యువరాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌పై జరిగిన దాడితో మిగతా బార్ల యాజమాన్యాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం బార్ యాజమాన్యాలు నాలుగో పోలీస్ స్టేషన్ సీఐని కలవనున్నట్లు తెలిసింది. దీనికంటే ముందే యువరాజ్ బార్ యాజమాన్యం తనను కలవాలని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ సమాచారం ఇచ్చారు. దీన్నిబట్టి చూస్తే బార్‌పై ఉద్దేశపూర్వకంగా దాడి చేసినట్టు తెలుస్తోందని యాజమాన్యం అనుమానిస్తోంది.

అర్హులందరికీ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన, ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. మండలంలోని ఎం.చెర్లోపల్లి, పాలబావి గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. వెంటనే రోడ్డు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యురాలు బోగే లక్ష్మీదేవి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల నిర్మించాలన్నారు. గ్రామాల్లో కరెంట్ సమస్యలు అధికమవుతున్నాయని.. లైన్‌మ్యాన్, ట్రాన్స్‌కో ఏఈ నంబర్లు కూడా పని చేయడం లేదని గొందిరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యుడు జాఫర్‌ఖాన్ తెలిపారు. ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మి మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు మండల స్థాయిలో ప్రతి ఒక్క అధికారి హాజరు కావాలన్నారు. వారు హాజరు కాని పరిస్థితిలో వారి కింది స్థాయి అధికారి తప్పకుండా హాజరు కావాలన్నారు. గైర్హాజరైన విద్యుత్, హార్టికల్చర్, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు నిలిచిన అభివృద్ధి పనులు.. ఇక నుంచి జరగాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే ఇదేనా?



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకారంతో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చాలా సందర్భాల్లో ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను మాత్రం పట్టించుకోలేదు. ఇదేనా ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే అని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయదశమికి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు గురువారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ అనంతపురం జోనల్ శాఖ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు 12వ పీఆర్సీ 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకుంటే జిల్లాశాఖ తరపున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, హిమగిరి ప్రసాద్, ఈశ్వరయ్య, చిదంబరరెడ్డి, హనుమంతు, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పలువురి బదిలీలు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పలువురు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారిని కీలకమైన విభాగాలకు బదిలీ చేయడం గమనార్హం. వాస్తవానికి ఇన్‌చార్జ్ వీసీకి బదిలీ చేసే అధికారం లేకపోయినప్పటికీ బదిలీలు చేపట్టడం వివాదస్పదంగా మారుతోంది. పాలకమండలి అనుమతి లేకుండా బదిలీలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ అంశంపై స్పందించి అక్రమార్కులకు కీలక విభాగాల్లో లేకుండా చూడాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డీఆర్ ఎస్.మధుసూదన్ రెడ్డి ఎగ్జామినేషన్ నుంచి జేఎన్‌టీయూ (ఏ)కు డీఆర్ బి.దుర్గాప్రసాద్ జేఎన్‌టీయూ (ఏ) నుంచి ఓటీపీఆర్ఐకు, ఏఆర్ జీఎస్ శంకర్ రెడ్డిని ఓటీపీఆర్ఐ నుంచి జేఎన్‌టీయూఏకు ఏఆర్ కే.మురళీ మోహన్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ నుంచి రెక్టార్ పేషీకి, ఏఆర్ ఏ.ప్రభాకర్ ఎస్టాబ్లిష్‌మెంట్ నుంచి హాస్టల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే ఏఆర్ జి.లింగప్ప డీఏపీ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్‌కు, ఏఆర్ కే.అబ్దుల్ ఖాదర్ హాస్టల్ కార్యాలయం నుంచి జేఎన్‌టీయూ(ఏ)కు సూపరింటెండెంట్ ఎస్.శివశంకర్‌గౌడ్ హాస్టల్ కార్యాలయం పరీక్షల విభాగానికి, సూపరింటెండెంట్ డి.శ్రీనివాసులును వీసీ పేషీ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు, సూపరింటెండెంట్ బి.సునీల్ కుమార్‌ను ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఫారిన్ ఎఫైర్స్ డీన్ కార్యాలయానికి మెకానికల్ ఫోర్‌మెన్ కే.గోపాల్ ఓటీపీఆర్ఐ మెకానికల్ విభాగానికి బదిలీ అయ్యారు. పైలెట్ ప్లాంట్ సూపర్‌వైజర్ జి.గోపాల్ ఓటీపీఆర్ఐ నుంచి సివిల్‌కు సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ సి.ఓబులేసు ఓటీపీఆర్ఐ నుంచి ఈఈఈ విభాగానికి, సీనియర్ అసిస్టెంట్ జీఎన్‌పీ ఆచారి రెక్టార్ పేషీ హాస్టల్ కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్ షేక్ అబ్బాస్ ఆలీని డీఐసీఎస్ రిజిస్ట్రార్ పేషీకి జూనియర్ అసిస్టెంట్ ఏ.సాయి మనీష్‌ను రిజిస్ట్రార్ పేషీ సీఎస్ఈకి, జూనియర్ అసిస్టెంట్ షేక్ మయాద్‌ను పరీక్షల విభాగం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి, జూనియర్ అసిస్టెంట్ బి. వెంకటేశ్‌ను సీఎస్ఈ నుంచి పరీక్షల విభాగానికి బదిలీ చేశారు.

వర్క్ ఆర్డర్ లేకుండా పనులు చేస్తారా?



మాట్లాడుతున్న కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, రహంతుల్లా, నరసింహులు హితవు పలికారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అశోక్ నగర్ బ్రిడ్జ్ నిర్మాణంపై ఎమ్మెల్యే దుగ్గపాటి మాటలను వారు తప్పుబట్టారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల ప్రణాళికతో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు బ్రేక్ వేయడంతో పాటు వారికి నచ్చినట్లు పనులు చేపట్టేలా ఎమ్మెల్యే దగ్గుపాటి చూస్తున్నారన్నారు. ఇప్పటికే నగరంలో జరగాల్సిన రూ.13 కోట్ల అభివృద్ధి పనుల జాప్యం వెనుక ఎమ్మెల్యే వారి అనుచరుల ప్రమేయం ఉందన్నారు. శ్రీనగర్ కాలనీలో వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే రూ.2.2 కోట్ల పనులు ఏ విధంగా మొదలు పెడుతారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి వీలైతే అభివృద్ధి చేసి చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాదూ, జావెద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అంగన్‌వాడీల్లోని చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి మాట్లాడుతూ.. ఆడపిల్లలను అన్నింటా సమానంగా చూడాలన్నారు.

మహా కనకదుర్గా.. శివానంద రూప

అనంతపురం కల్చరల్/రాప్తాడు: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో కీలక ఘట్టమైన దుర్గాష్టమి రాకతో అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు చోట్ల పార్వతీ మాత దుర్గాదేవిగా అవతరించి పూజలందుకుంది. దీప దూపనైవేద్యాలతో అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.



పాతూరు అమ్మవారి శాలలో పూజలు చేయించిన మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం



గుత్తి రోడ్డులోని చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారు



నడిమి వంకలో గంగమ్మ ఆలయంలో..



మహిషాసుర మర్ధినిగా అమ్మవారు



రాప్తాడు: ఇందిరమ్మ కాలనీలో దుర్గాదేవి

పురవీధుల్లో గోవిందుడి దివ్యదర్శనం



చంద్రప్రభ వాహనంపై వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. ఏడుకొండలవాడు గురువారం రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఆర్ఎఫ్ రోడ్డు, హౌసింగ్ బోర్డు, శ్రీనివాస నగర్ తదితర చోట్ల జనసందోహంతో శ్రీవారి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. ఉదయం ప్రధాన అర్చకుడు హరికిషోర్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు అభిషేకాలు, అలంకార సేవలతో పాటూ దీక్షా హోమాన్ని పలువురు అర్చకులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో రైల్వేఫీడర్ రోడ్డు వేంకటేశ్వరాలయం సందడిగా మారింది.

పప్పుశనగ పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని రైతులకు ఏఈఓ సుజిత గురువారం పప్పుశనగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పప్పుశనగ అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలో 480 ఎకరాలకు సంబంధించి 7,050 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

రతన్‌టాటా మృతి తీరని లోటు



రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రతన్‌టాటా మృతి భారతీయులందరికీ తీరని లోటని నగర మేయర్ వసీం పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో గురువారం రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా, మానవతావాదిగా దాతృత్వం కలిగిన గొప్ప మనిషి రతన్‌టాటా ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, నరసింహులు, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, సైఫుల్లాబేగ్, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్, డీఈ సుభాష్ చంద్రబోస్, మేనేజర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి వ్యక్తి మృతి

అనంతపురం: ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి కిందకు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నగరంలోని శ్రీశ్రీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పవన్ కుమార్(35) పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గురువారం మిద్దెపై ఆరేసిన దుస్తులను తీసుకు వచ్చేందుకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలుజారి పైనుంచి కిందపడ్డాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

సీటీఎంను కలసిన నేతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీ అనంతపురం రీజియన్ నూతన సీటీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీలక్ష్మిని ఎన్ఎంయూ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఆమె విజయవాడ నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో అనంతపురం ఎన్ఎంయూ చైర్మన్ సూరిబాబుతో పాటు జిల్లా అధ్యక్షుడు ముద్దుపాటి లక్ష్మీనారాయణ, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ఆశయాలు కొనసాగిస్తాం



నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా, జేఏసీ నాయకుడిగా పని చేసిన నాగాటి నారాయణ ఆశయాలు కొనసాగిస్తామని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నారాయణ రెండో వర్ధంతి నిర్వహించారు. తొలుత నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు, ఉన్నతికి నారాయణ అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. యూటీఎఫ్ అనేక సమరశీల పోరాటాలు చేయడంలో, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటంలో నారాయణ కృషి చాలా ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌వీవీ రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, నాయకులు శ్రీనివాసులు, వీరేశ్వరాచారి, గంగాధర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రౌడీ షీట్లను ఎత్తివేయాలి

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఎలాంటి నేర చరిత లేని వారిపై రౌడీ షీట్లను ఎత్తివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ కోరారు. గురువారం ఎస్పీ పి. జగదీష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఉద్యమాల్లో పాల్గొన్న వారిపై పెట్టిన రౌడీషీట్లను ఎత్తివేయాలన్నారు. ఏటా డిసెంబర్ నెలలో రౌడీషీటర్ల నేర ప్రవర్తనపై సమీక్ష చేస్తారని.. ఇందులో భాగంగా అన్ని అంశాలను పరిశీలించి సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్ లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు చిరంజీవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

16న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాప్తాడు: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు ఈనెల 16న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ధనలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మినీ, అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి గత నెల 24 నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న పది పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురం రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220732, 9912220719, 9912220724
9010223702, 9010567770, 9010588846

టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జెడ్
వోఎస్: విండోస్ 11 హోమ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మెమరీ: 12జీబి ర్యామ్/256జీబి/512 జీబి స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ అల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్‌ఎవిట్
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్‌డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.



ఇన్‌స్పిరేషన్

రుక్మిణి వారియర్

ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా? 'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా? ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్. ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిల్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్సిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది.

స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది.

'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగంలోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైవోవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ ఏరియా



మెటా వారి మూవీ జెన్


'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఓపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది.

మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

గేమింగ్

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అగ్రెమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోక్రాన్‌ను ఎదుర్కోవడం.



ఆయుధాల దండోర

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

ధీ ధీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'ధీ ధీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఓషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఐతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...



● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.



● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

పవర్‌ఫుల్ ఝాన్సీ



● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో



● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ



● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ- ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ - అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా



● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్‌ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్‌ఎస్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ- ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్‌ఎస్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్లు, మనసు, ఎల్‌ఎస్‌ఎల్‌ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్లు'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్



● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికే హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్లడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదాపు రోడ్డు మార్గానే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయి రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ